సమరశంఖం

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన
- తొలి విడుతలో ఆరు నియోజక వర్గాల్లో బీఆర్ఎస్ రణగర్జన
- 18న జడ్చర్లలో సమరశంఖం పూరించనున్న పార్టీ అధినేత
- విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- భారీగా జనసమీకరణ చేసేలా నేతల సమాయత్తం
- ముఖ్యమంత్రి పర్యటనతో ప్రతిపక్షాల గుండెల్లో గుబులు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడి మొదలైంది. విపక్షాల్లో టికెట్ల లొల్లి ఇంకా నడుస్తుండగానే బీఆర్ఎస్ ఒక అడుగు ముందుకేసి ఎన్నికలకు సమరశంఖం పూరించింది. పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో ఆరు బహిరంగ సభల్లో పాల్గొంటూ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో సీఎం ప్రచార సభలు ఖరారయ్యాయి. ఈనెల 18 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఆరు చోట్ల భారీ బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, నాగర్‌కర్నూల్, గద్వాలలో, నారాయణపేట జిల్లా మక్తల్, నారాయణపేటల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టనున్నారు. ఈ సభలకు ఏకంగా పార్టీ అధినేత పాల్గొంటుండడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారింది. సీఎం పర్యటన ఖరారు కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త జోష్ మొదలైంది. బీఆర్ఎస్ రథచక్రాలు కదులుతున్నాయి. ఇక కాచుకోండంటూ కాంగ్రెస్, బీజేపీలకు సవాల్ విసురుతున్నారు. ఉమ్మడి జిల్లాలో గత ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన వాళ్లకే మళ్లీ టికెట్లు దక్కడంతో ఆయా నియోజకవర్గాల్లో క్యాడర్ ఫుల్ జోష్‌లో ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల మెజార్టీపై పందెం కాస్తున్నారు. టికెట్లు ప్రకటించి విపక్షాలకు షాక్ ఇచ్చిన కేసీఆర్ ఈనెల 15న తెలంగాణ భవన్‌లో సమావేశం నిర్వహించి టికెట్లు దక్కించుకున్న సిట్టింగ్‌లకు ఏకంగా బీఫాంలను అందిస్తారు. ఈ సమావేశం తర్వాత జిల్లాల్లో ఎన్నికల ప్రచారపర్వం ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాల్లో తొలివిడుత ఆరు నియోజకవర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. కాగా, తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన జడ్చర్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చర్లకోల లక్ష్మారెడ్డి నియోజకవర్గం నుంచి సెంటిమెంట్‌గా ప్రచారం ప్రారంభిస్తున్నారు. రణగర్జనకు కనీవినీ ఎరుగని రీతిలో జనాన్ని సమీకరించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.



పక్కా వ్యూహంతో సమరానికి..

విపక్షాల వ్యూహాలను చిత్తుచేస్తూ బీఆర్ఎస్ ప్రచార పర్వానికి తెరతీయడంతో గుబులు ప్రారంభమైంది. ఏకంగా సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో ప్రచారాన్ని ప్రారంభిస్తుండటంతో ఒక్కసారిగా జోష్ పెరిగింది. పులి వస్తుంది.. కాచుకోండంటూ సోషల్‌మీడియా వేదికగా పోస్టులు ట్రోలింగ్ అవుతున్నాయి. దీంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. వచ్చే నెల 9న నోటిఫికేషన్ వస్తుండటంతో బీఆర్ఎస్ అధినేత అస్త్రాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థుల, సంక్షేమ కార్యక్రమాల పేరుతో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోని ప్రజలతో మమేకమయ్యారు. షెడ్యూల్ రాకముందే మంత్రులు, ఎమ్మెల్యేలు సుడిగాలి పర్యటనలు చేపట్టి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాత్రి ఒంటిగంట వరకు అన్ని గ్రామాలను చుట్టివచ్చారు. ఆగస్టు 21న టికెట్లు ఖరారు చేశారు. 14 మంది ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్లు కేటాయించారు. దీంతో అన్ని నియోజకవర్గాల్లో సంబురాలు అంబరాన్ని అంటాయి. బీఆర్ఎస్ క్యాడర్ అంతా సిట్టింగ్‌లకే జై కొట్టారు. పక్కావ్యూహంతో ఎన్నికల సమరానికి సై అంటుండటంతో కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి భయం పట్టుకుంది.

18నుంచి ప్రచారానికి శ్రీకారం..

ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ సంసిద్ధమైంది. పార్టీ అధినేత ప్రచారానికి వస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో క్యాడర్ ఫుల్‌జోష్‌లో ఉంది. ప్రస్తుతం 12 నియోజకవర్గాల్లో తొలివిడుత ఏకంగా కేసీఆర్ ఆరు నియోజకవర్గాల్లో బహిరంగసభల్లో పాల్గొంటున్నారు. ఈనెల 18న జడ్చర్ల నుంచి ముహూర్తం ఖరారు చేశారు. 26న అచ్చంపేట, నాగర్‌కర్నూల్, నవంబర్ 6వ తేదీన గద్వాల, మక్తల్, నారాయణపేటల్లో జరిగే భారీ బహిరంగ సభల్లో గులాబీ బాస్ పాల్గొననున్నారు. దీంతో ఆయా చోట్ల పార్టీ నేతలు జనసమీకరణకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రెండు నెలలుగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మహమూద్‌అలీ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

భారీ జనసమీకరణకు కసరత్తు

ఉమ్మడి జిల్లాలో పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి వస్తుండడంతో భారీగా జనాలను సమీకరించేందుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పార్టీ నేతలతో సమావేశమవుతున్నారు. ఈనెల 18న జడ్చర్లలో జరిగే ఎన్నికల ప్రచార సభకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పార్టీ నేతలతో కలిసి జడ్చర్ల మండలం రంగాపూర్ గ్రామశివారులోని శివాలయం వద్ద సీఎం సభకు స్థలాన్ని పరిశీలించారు. సుమారు 50 ఎకరాల్లో సభా స్థలాన్ని చదును చేస్తున్నారు. భారీ ఎత్తున జన సమీకరణ కోసం నియోజకవర్గ నేతలతో సమావేశయ్యారు. సభను విజయవంతం చేసేందుకు నడుంబిగించాలని పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. 26న సీఎం అచ్చంపేటలో జరిగే సభలో పాల్గొననున్నారు. ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సభ స్థలాన్ని ఎంపిక చేసేందుకు సమాలోచనలు చేస్తున్నారు. పార్టీక్యాడర్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పండుగ తర్వాత వస్తుండటంతో జనాలను తరలించి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అడిగి హామీ తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మక్తల్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సీఎం కేసీఆర్ సభకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

లెక్కతేలింది

- గద్వాల జిల్లాలో 2018లో 4,43,938 మంది ఓటర్లు
- 2023 అక్టోబర్‌లో 4,89,945మంది..
- ఐదేండ్లలో పెరిగిన 46,007మంది ఓటర్లు
- నడిగడ్డలో మహిళా ఓటర్లే అధికం

గద్వాల : అక్టోబర్ 11 : జోగులాంబ గద్వాల జిల్లా ఓటర్ల లెక్క తేలింది. 2023 అక్టోబర్ 4వ తేదీ వరకు ఓటర్ల తుది జాబితా ఎన్నికల కమీషన్ విడుదల చేసింది. 2023 అక్టోబర్ వరకు ఓటర్ నమోదుకు వచ్చిన దరఖాస్తులను దృష్టిలో ఉంచుకొని ఓటర్ జాబితాను రూపొందించారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓటర్ నమోదు చేసుకున్నారు.అధికారులు ప్రజలకు ఓటర్ నమోదుపై అవగాహన కల్పించడంతో మహిళలు ఎక్కువగా ఓటు హక్కును నమోదు చేసుకున్నారు.దేశ భవిష్యత్‌ను మార్చే శక్తి కేవలం ఓటర్‌కు మాత్రమే ఉంది.ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు గా భావించి ప్రతి ఒక్కరు నమోదు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడంతో ఓటర్లు అధికంగా ఓటు హక్కును నమోదు చేసుకున్నారు.2018తో పోల్చితే 2023 వరకు అదనంగా 46,007 మంది ఓటర్లు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకున్నారు. 2018లో జిల్లాలో 4,43,938 మంది ఓటర్లు ఉండగా, 2023 ఓటరు తుది జాబితా విడుదల చేసిన నాటికి జిల్లాలో 4,89,945 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో గద్వాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,53,889 మంది ఉండగా, అందులో పురుషులు 1,24,763 మంది ఓటర్లు, మహిళలు 1,29,096 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 4,333 మంది అధికంగా ఉన్నారు అలంపూర్‌లో మొత్తం ఓటర్లు 2,36,076 మంది ఉండగా, అందులో పురుషులు 1,16,989 మంది ఓటర్లు, మహిళలు 1,19,080 మంది ఉన్నారు. ఇందులో పురుషుల కంటే మహిళలు 2,091 మంది అధికంగా ఉన్నారు. జిల్లా మొత్తంగా పురుషులు 2,41,752 మంది ఉండగా, మహిళలు 2,48,176 మంది ఉన్నారు. ఇతరులు 17మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలు 6,452 మంది ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో మొత్తం 593 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కులం, మతం, వర్గ, లింగ బేధాలు లేకుండా ఓటు హక్కు కల్పించడంతో యువత తమ ఓటు నమోదు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారు. 18 నుంచి 19ఏండ్లలోపు జిల్లాలో ఓటు హక్కు నమోదు చేసుకున్న యువత 21,711 మంది ఉన్నారు.

గద్వాల నియోజకవర్గ ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు
గద్వాల	48.694	50.744
ధరూర్	18.762	19.476
కేటిదొడ్డి	13.841	14.008
గట్టు	22.732	23.488
మల్దకల్	20.734	21.380

ఇతరులు 10 మంది ఉన్నారు.

అలంపూర్ నియోజకవర్గంలో..

మండలం	పురుషులు	మహిళలు
ఇటిక్యాల	20.458	20.573
అయిజ	33.024	33.591
వడ్డేపల్లి	13.266	13.448
రాజోళి	13.642	13.727
మానవపాడు	12.474	12.935
ఉండవెల్లి	10.903	11.255
అలంపూర్	13.222	13.551

ఇతరులు 7మంది ఉన్నారు.

యువత, మహిళల ఓటర్లే కీలకం..

జిల్లాలో యువత, మహిళా ఓటర్ల ఓట్లు అభ్యర్థులకు ప్రధానం కానున్నాయి. దేశ భవిష్యత్‌లో ప్రధాన పాత్ర పోషించే యువత ఓట్లు జోగులాంబ గద్వాల జిల్లాలో 21,711 ఉన్నాయి. అలాగే మహిళల ఓట్లు 2,48,175 ఉన్నాయి. మొత్తం 2,69,886 ఓట్లు మహిళలు, యువతవే ఉన్నాయి. మిగతా ఓట్లు 2,20,059 ఉన్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో యువత, మహిళల ఓట్లు కీలకం కానున్నాయి. ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు యువత, మహిళలతో సమావేశమై ఓట్లు అభ్యర్థించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 2018 ఎన్నికలప్పుడు ఉన్న ఓట్లకు ప్రస్తుతం ప్రకటించిన ఓట్లకు అదనంగా 46,007 ఓట్లు పెరిగాయి.

- తుది దశకు చేరిన పనులు
- జిల్లాకు చేరిన మిషన్, త్వరలో బిగింపు
- 134రకాల వైద్య పరీక్షలు
- 24గంటల్లోనే రోగాల ఫలితాలు
- ఉచితంగా రూ.10వేల ఖరీదైన టెస్టులు
- వ్యాధులు ముదరకముందే చికిత్స
- పేదల ఆర్థిక కష్టాలకు చెల్లు

డయాగ్నొస్టిక్ కేంద్రం సిద్ధం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత నీళ్లు, నిధులతోపాటు వైద్య రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారు. జిల్లాలుగా ఏర్పడడం మరింత కలిసొచ్చింది. ఇందులో భాగంగా జిల్లాకు ఓ మెడికల్ కళాశాల ఏర్పాటవగా, అనుబంధంగా తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రం ఏర్పడటం విశేషం. దీని వల్ల పేదలకు దాదాపుగా 134రకాల వైద్య పరీక్షలను ఉచితంగానే అందిస్తారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ డయాగ్నోస్టిక్ కేంద్రం పనులు తుది దశలో ఉండటంతో త్వరలో ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

త్వరలో డయాగ్నొస్టిక్ కేంద్రం ప్రారంభం..

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో టీ-డయాగ్నొస్టిక్ కేంద్రం త్వరలో ప్రారంభం కానున్నది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ప్రభుత్వం తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. గత జూన్‌లో రాష్ట్రవైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఈ కేంద్రాలను పలు జిల్లాల్లో ఈ కేంద్రాలు ప్రారంభించారు. నాగర్‌కర్నూల్‌లోనూ నిర్మించిన డయాగ్నోస్టిక్ కేంద్రం భవన నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. ఈ కేంద్రం ద్వారా తొలుత 57రకాల వైద్య పరీక్షలను మాత్రమే చేయడం జరుగుతుంది. అయితే వైద్యరంగంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ, పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ఈ పరీక్షలను 134కు పెంచడం గమనార్హం. ఈ కేంద్రంలో ఖరీదైన పరీక్షలన్నీ పూర్తిగా ఉచితంగానే చేయడం జరుగుతుంది. ఇందులో అందించే పరీక్షలతో ప్రైవేట్ ల్యాబుల్లో రూ.500నుంచి రూ.10వేల వరకు ఖర్చవుతాయి. దీనివల్ల పేదలకు వేలాది రూపాయల ఆర్థికభారం తప్పుతుంది. ఇమ్యూనోహిస్టోకెమిస్ట్రీ పరీక్షకు ప్రైవేట్ ల్యాబుల్లో రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. అలాగే తలసీమియా, హీమోఫీలియా, అనీమియా, హెచ్ఐవీ, వైరల్‌లోడ్‌లాంటి టెస్టులూ ఈ కేంద్రం ద్వారా చేస్తారు. అదేవిధంగా రక్త, మూత్ర పరీక్షలు, ఎక్స్‌రేలతోపాటు గుండె పరీక్షలైన ఈసీజీ టూడీ ఈకో కూడా చేస్తారు. దీనివల్ల అత్యవసర సమయాల్లో ప్రైవేట్ దవాఖానలకు వెళ్లాల్సిన అవసరం ఇకపై ఉండదు. ప్రభుత్వ దవాఖానలో 24గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండటం వల్ల గుండె, ఇతర సమస్యలుంటే వెంటనే ఈ పరీక్షలు చేసి అత్యవసర చికిత్సలు కూడా అందించేందుకు వీలవుతుంది. వీటితోపాటు క్యాన్సర్ నిర్ధారణ చేసే మమ్మోగ్రామ్ పరీక్షలు కూడా ఈ ల్యాబ్‌లో జరగనుండటం ప్రత్యేకం. గతంలో క్యాన్సర్ పరీక్షలంటే హైదరాబాద్‌కు మాత్రమే వెళ్లాల్సి ఉండేది. త్వరలో ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే గుండె, క్యాన్సర్‌లాంటి పరీక్షలూ టీ డయాగ్నోస్టిక్ కేంద్రంలోనే చేసేందుకు వీలుంటుంది. ఇందులో చేసే సాధారణ పరీక్షల ఫలితాలను కేవలం 24గంటల్లోనే అందించడం జరుగుతుంది. ప్రభుత్వ దవాఖానల్లో ఈ రోజు పరీక్షకు వైద్యులు చీటీ రాస్తే రెండు రోజులు పట్టే సమయం స్థానంలో ఒక్క రోజులోనే వస్తాయి. దీనివల్ల దవాఖానకు వచ్చిన రోగి అదే రోజు పరీక్షలు చేయించుకొని మందులు రాయించుకొని ఇంటికి వెళ్లవచ్చు. ఫలితంగా వ్యాధులను ప్రాణాంతకంగా మారక ముందే తొలుతే గుర్తించడానికి వీలవుతుంది.

దవాఖానకు చేరిన యంత్రం..

నాగర్‌కర్నూల్ డయాగ్నోస్టిక్ కేంద్ర భవన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. పరీక్షలు చేసే యంత్రం కూడా జిల్లా జనరల్ దవాఖానకు చేరింది. ప్రత్యేక క్రేన్ సాయంతో ఈ యంత్రాన్ని ఉయ్యాలవాడ వద్ద మెడికల్ కళాశాల పక్కన నిర్మించిన డయాగ్నోస్టిక్ కేంద్రానికి తరలించనున్నారు. హైదరాబాద్ నుంచి నిపుణులను రప్పించేందుకు అధికారులు సమాచారం అందించారు. రాబోయే రెండు వారాల్లో ఈ యంత్రాన్ని బిగించనున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవంలో జాప్యం కలుగుతోంది. అయితే ప్రజల కోసం అధికారులే వచ్చే నెలలో ఈ కేంద్రం సేవలను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తమ్మీద ఈ టీ-డయాగ్నోస్టిక్ కేంద్రం అందుబాటులోకి వస్తుండటంతో పేద ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలోనే ప్రారంభిస్తాం..

టీ-డయాగ్నొస్టిక్ కేంద్రం ద్వారా 134 వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారు. జిల్లా దవాఖానలో పరీక్ష యంత్రం వచ్చింది. హైదరాబాద్ నుంచి నిపుణులను తీసుకొచ్చి ప్రత్యేక క్రేన్ ద్వారా డయాగ్నస్టిక్ కేంద్రానికి తరలించి బిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెలలో ఈ కేంద్రం ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఈ కేంద్రంలో పరీక్షలు 24గంటల్లోనే రావడంవల్ల రోగులకు వెంటనే మందులు, చికిత్సలు అందుతాయి.

- డాక్టర్ రఘు, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్, నాగర్‌కర్నూల్

చెరువులకు పునర్జీవం

- ఆయకట్టు రైతులకు భరోసా
- పెరిగిన భూగర్భ జలాలు
- మినీ ట్యాంక్‌బండ్‌గా మార్పు
- పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం
- కట్టపాడువునా చెట్లు, ఎల్ఈడీ లైట్లు, బెంచీలు ఏర్పాటు

వనపర్తి, అక్టోబర్ 11 : కంపచెట్లతో నిండి నెర్రలుబారిన నేలలతో నిరుపయోగంగా మారిన చెరువులను మిషన్ కాకతీయ ద్వారా సీఎం కేసీఆర్ చెరువులను పునరుజ్జీవన పోశారు. కంపచెట్లు, పూడికతీత పనులను చేపట్టి ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టేలా చర్యలు చేపట్టారు. దీంతో చెరువు కింది ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసానిచ్చారు. అంతేకాకుండా భూగర్భజలాలు సైతం పెరిగి సాగు, తాగునీటి చింతను తీర్చారు. అలాగే పట్టణాల్లో మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించారు. జిల్‌జిల్ జిగేల్ మనేలా ఎల్ఈడీ లైట్లు, వివిధ ఆకృతుల్లో మొక్కల పెంపకం, వాకింగ్ ట్రాక్, ప్రజలు సేద తీరేందుకు బెంచీల ఏర్పాటు, బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక ఘాట్ వంటి సౌకర్యాలు కల్పించారు. దీంతో పట్టణానికే మినీట్యాంక్‌బండ్‌లుగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వనపర్తి పట్టణంలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పట్టణ నలువైపులా అన్యాక్రాంతమవుతున్న చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. వాటిని మినీ ట్యాంక్ బండ్‌లుగా తీర్చిదిద్దడమే కాక ఎల్లవేళలా నిండుకుండలా ఉండేలా ప్రణాళికలను రూపొందించారు. గోపాల్‌పేట రోడ్డు మార్గంలో నల్లచెరువు, కొత్తకోట రోడ్డు మార్గంలోని అమ్మచెరువు, పానగల్ రోడ్డు మార్గంలోని తాళ్ల చెరువు, పెబ్బేరు మార్గంలో మర్రికుంట, లక్ష్మీకుంటలను మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దారు. పట్టణంలోని నలువైపులా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు ఆయా ప్రాంతాలు ప్రత్యేక శోభను అలకరించుకున్నాయి. దాదాపుగా వీటిన్నింటికీ రూ.13.12కోట్లు ఖర్చు చేశారు. ప్రత్యేకంగా ఈ ప్రాంత మత్స్యకారులకు జీవనానికి మూలంగా నల్లచెరువు, అమ్మచెరువులకు నేడు జీవనబండారాలుగా నిలిచాయి.

అన్యాక్రాంతమైన చెరువులకు రక్షణ..

వనపర్తి చుట్టూ అన్యాక్రాంతమై, నిరాధరణకు సాక్ష్యాలుగా నిలిచిన నల్లచెరువు, రాజనగరం అమ్మచెరువు, తాళ్ల చెరువు, ఈదుల చెరువులను పున్నుద్ధరించారు. తాళ్ల చెరువు, అమ్మచెరువు, నల్ల చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా చేసి వనపర్తి పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. శ్రీనివాసపురం మొండి కుంటకు అధునీకరించి లక్ష్మీకుంటగా మంత్రి నామకరణం చేసి ప్రాణం పోశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 4.40 మీటర్లకు భూగర్భజలాలూ పెరిగిన ప్రాంతంగా వనపర్తి నిలిచింది. దీంతో వనపర్తి పట్టణ ప్రాంత ప్రజలకు నీటి అవసరాలకు భవిష్యత్‌లో కూడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేశారు.

తాళ్ల చెరువుకు పురుజీవం..

వనపర్తి పట్టణానికి ఉత్తర భాగాన్న ఉన్న తాళ్ల చెరువు రైతులకు ఆయువు పట్టుగా ఉండేది. వర్షాలు లేక భూములు సాగు లేక బీడుగా మారి కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల కుట్రలతో చెరువు అన్యాక్రాంతం అవుతూ వచ్చింది. మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి తాళ్లచెరువునుమినీ ట్యాంక్‌బండ్‌గా చేపట్టాలన్న లక్ష్యంగా పునరుద్ధరణ పనులను చేపట్టారు. ప్రస్తుతం ఈ చెరువు కింద 50ఎకరాల ఆయకట్టు సాగవడమే కాకుండా భూగర్భజలాల వృద్ధి, తాగునీటి కొరత కూడా తీరింది. కట్ట సుందరీకరణతో ఇరువైపులా చెట్లు నాటిచారు. ఎల్ఈడీ లైట్స్, ఎల్లవేళలా ప్రజలు, బాటసారులు సేద తీరడానికి బెంచీలు ఏర్పాటు చేయించారు. తాళ్లచెరువు సుమారుగా 37.49 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ కింద అన్యాక్రాంతమైంది. 35 ఏండ్లుగా మురికికూపంగా మారిన చెరువు మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో పునరుజ్జీవన పోసుకున్నది. నల్లచెరువు సుందరీకరణ కోసం మంత్రి నిరంజన్‌రెడ్డి రూ.11.44కోట్లతో పనులను చేపట్టారు. ప్రత్యేకంగా బతుకమ్మ ఘాట్‌ను ఏర్పాటు చేశారు. చెరువుకింద 398 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు పారుతుంది. ప్రస్తుతం నల్లచెరువు సుమారుగా 229.5 ఎకరాల్లో విస్తరించి ఉండటంతో ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు బోటింగ్ సౌకర్యానికి ఏర్పాట్లు చేశారు.

సుందరీకరించిన నల్ల చెరువు మినీ ట్యాంక్ బండ్

ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లు

రాజనగరం అమ్మచెరువు..

ఒకప్పుడు రాజనగరం అమ్మచెరువు చుట్టుపక్కల పెద్ద ఎత్తున నెలరోజుల పాటు జాతర సాగేది. అక్కడికి వచ్చిన ప్రజలకు ఆహ్లాదమిచ్చేది. పశువులకు దాహాన్ని తీర్చేదిగా ఉండేది. కానీ కాలక్రమేణ పిచ్చిమొక్కలతో కనుమరుగయ్యే స్థితికి వచ్చింది. మంత్రి నిరంజన్‌రెడ్డి మినీ ట్యాంక్‌బండ్‌గా చేశారు. ఒకప్పుడు అమ్మచెరువు కట్టపై సైకిల్ దూరని స్థితి నుంచి, ఒకేసారి నాలుగు భారీ వాహనాలు వెళ్లేలా కట్ట విస్తరణ చేపట్టారు. ఈ చెరువు కింద సుమారు 230 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తున్నది. ప్రస్తుతం అమ్మ చెరువు సుమారుగా 135.66 ఎకరాల్లో విస్తరించి ఉంది. పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.68.80 లక్షలు వెచ్చించింది.

కేంద్రబిందువుగా నల్లచెరువు..

నల్లచెరువు గత పాలకుల హయాంలో నిరాదరణకు గురైంది. 160 ఎకరాల ఆయకట్టులో, 60 రాల్లో విస్తరించి ఉంది. దీని పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.78.40లక్షలు వెచ్చించింది.

నల్ల చెరువుకట్టపైకి వెళ్లాలంటే భయంగా ఉండేది..

గతంలో చెరువుకట్టపైకి వెళ్లాలంటేనే భయంగా ఉండేది. కేవలం కట్టపై నడిచేందుకు మాత్రమే బాట ఉండేది. నిండుగా కంపచెట్లు ఉండడంతో పొలాలకు వెళ్లేందుకు కొంతమంది కలిస్తేనే వెళ్లే పరిస్థితులు ఉండేవి. నేడు చెరువు రూపురేఖలే మారిపోయాయి. కట్టపోంటి పెద్ద రోడ్డు, లైట్లు, కుర్చీలు వేసిన్రు. నిరంజన్‌రెడ్డి సార్ వచ్చినంకనే ఇంత బాగైంది. ఇంతకుముందు నాయకులు ఇవన్నీ పట్టించుకోలే.

- గుంటి జయమ్మ, మహిళా రైతు, వనపర్తి



శ్రీనివాస్‌పురం లక్ష్మీకుంట...

శ్రీనివాస్‌పురం లక్ష్మీకుంటకు మొండి కుంటగా పేరుండేది. ఈ ప్రాంత బోర్లు ఆసరాగా ఉండేది. వర్షకాలంలో మాత్రమే నిండి భూగర్భ జలాలకు కొంత ఊరట అందిస్తుండేది. మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీటి కొరత తీర్చేందుకు ఈ కుంటకు పునరుజ్జీవన పోసి లక్ష్మీకుంటగా నామకరణాన్ని మంత్రి చేశారు. కుంట చుట్టూ కట్టలు పోయింది, నీళ్లు నింపి, అందంగా తయారు చేయించారు. ఈదుల చెరువు నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా లక్ష్మీకుంటలోనీటిని నింపి శ్రీనివాస్‌పురం గ్రామానికి సాగు, తాగునీటి ఢోకా లేకుండా చేశారు. ఇక్కడి అడవిలోని వణ్యప్రాణులు దాహార్తిని తీర్చడంతోపాటు ఈ ప్రాంతంలోని బోర్ల రీచార్జ్‌కు ఎంతగానో తోడ్పాటు అయ్యింది. లక్ష్మీకుంట ప్రాంతం సూర్యోదయం, సూర్యాస్తమయంలో వాతావరణం ప్రకృతి ప్రేమికుల మనస్సులను దోచుకుంటుంది. 50ఎకరాల వరకు ఆయకట్టు సాగావుతున్నది. 17.85 ఎకరాల్లో విస్తరించి ఉండగా, పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20లక్షలు వెచ్చించింది.

లక్ష్మీకుంట రూపురేఖలు మారిపోయినయ్..

శ్రీనివాసపురం ప్రాంతంలో వేసవికాలం వస్తే చాలు నీటితో కటకట ఉండేది. మంత్రిని శ్రీనివాసపురం వాళ్లమంతా కలిసి మా ప్రాంతానికి నీళ్లు ఇస్తే మీ వె